వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

- సన్న రకం ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్
- వీసీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

వీసీలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, అధికారులు

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 3: వానకాల సీజన్ వరి కొనుగోలు కేంద్రాలు పకడ్బందీగా నిర్వహించాలని, సన్నరకం వరి ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కలెక్టర్లను, అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి వానకాల ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లు, డీఎస్పీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్, అపాయింట్‌మెంట్ ఆర్డర్ల ప్రక్రియను రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, అగ్రికల్చర్, మార్కెటింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి కలెక్టర్ సంతోష్, ఎస్పీ వైభవ్ రఘునాథ్, అదనపు కలెక్టర్లు సీతారామారావు, దేవసహాయం, సంబంధిత అధికారులు హాజరయ్యారు. వరి కొనుగోలు కేంద్రాల్లో కలెక్టర్లు పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా 60.73 లక్షల ఎకరాల్లో వరి ధాన్యం సాగు చేయబడిందని, దానికి అనుగుణంగా జిల్లాల వ్యాప్తంగా వానకాల సీజన్ వరి కొనుగోలు కేంద్రాలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. వరి కొనుగోలు కేంద్రాల పెంపు, రైతులకు ఇబ్బంది లేకుండా అధికారులు పూర్తి స్థాయి వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాట్లు చేయాలని, కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తూ కొనుగోలు కేంద్రాల నిర్వాహణపై దృష్టి సారించాలన్నారు. సన్న, దొడ్డురకం వరిధాన్యం కొనుగోలుకు వేర్వేరుగా కేంద్రాలు ఏర్పాటుచేయాలని సూచించారు. సన్న రకం వరి ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్‌ను ప్రభుత్వం రైతులకు అందిస్తుందని సీఎం తెలిపారు. అనంతరం డీఎస్పీ 2024ఫలితాలు మెరిట్ ఆధారంగా ఎంపికైన ఉపాధ్యాయుల ఒరిజినల్ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ ప్రక్రియను అత్యంత వేగవంతంగా పూర్తి చేసి ఈనెల 9వ తేదీ వరకు ఉపాధ్యాయ నియామక పత్రాలను అందించేందుకు కలెక్టర్లు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంపికైన ఉపాధ్యాయులకు హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నియామక పత్రాలను అందజేశారన్నారు. అనంతరం కలెక్టర్ సంతోష్ అధికారులతో మాట్లాడుతూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తున్న సహకార శాఖ ద్వారా, ఐకేపీ, మెప్మా సెంటర్ల నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకొని కేంద్రాలను నిర్వహించాలని, సన్న రకం వరి ధాన్యానికి దొడ్డు రకం వరి వేర్వేరుగా కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

శరన్నవరాత్రోత్సవాలు షురూ

- జిల్లాలో కొలువుదీరిన అమ్మవారి విగ్రహాలు
- మొదటిరోజు బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరణ
- వైభవంగా వాసవీమాత శోభాయాత్ర
- భక్తులకు అన్నదానం చేసిన నిర్వాహకులు

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 3 : జిల్లా కేంద్రంలో గురువారం దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వైభంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బాలాత్రిపురసుందరీ దేవీగా అలంకరించి పూజలు చేశారు. కొల్లాపూర్ చౌరస్తాలోని సరస్వతీ ఆలయంలో, రాఘవేంద్ర కాలనీలోని మహా గౌరీయూత్ అసోసియేషన్, బజరంగ్‌దళ్ యూత్ ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రతిష్ఠించి పూజలు చేశారు. వాసవీ మాత శోభా యాత్రను అట్టహాసంగా నిర్వహించారు. మార్కెట్ యార్డులోని శివాలయం నుంచి వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు యాత్ర కొనసాగింది. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు హరి బాబు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కల్వకుర్తిలో..

కల్వకుర్తి/కల్వకుర్తి రూరల్, అక్టోబర్ 3 : పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో శరన్నవరాత్రోత్సవాలు కనులపండువగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు గజలక్ష్మి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శమిచ్చారు. గురువారం ఉదయాన్నే అమ్మవారిని సుప్రభాతంతో మేల్కొలిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా మార్చాల, తర్నికల్, కుర్మిద్ద, జీడిపల్లి, గుండూర్, లింగసానిపల్లి గ్రామాలతోపాటు ఆయా గ్రామాల్లో ఉత్సవాలు ప్రారంభమైనాయి. అమ్మవారు బాలా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా గ్రామాల్లో భక్తులు అమ్మవారి దీక్షలను స్వీకరించారు. గాంధీనగర్‌లో పెద్దమ్మ తల్లి యూత్ సభ్యులు ప్రతిష్ఠించిన అమ్మవారికి కాలనీవాసులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ రమేశ్‌బాబు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి నారాయణరాజు, ఉత్సవ కమిటీ బృందం నితిన్, తరుణ్, మనీశ్, శ్రీనివాసులు, ముత్యాలు, శేఖర్, కిరణ్, రవి, రమేశ్, శ్రీధర్, జగదీశ్వర్ పాల్గొన్నారు.

ఊరూరా విగ్రహాలు

వెల్దండ/బిజినేపల్లి/కోడేరు/బల్మూరు/తిమ్మాజిపేట, అక్టోబర్ 3 : దేవీ శరన్నవ రాత్రులు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. వెల్దండ బుధవార్ పేట ఆంజనేయ స్వామి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో, కొట్ర, పెద్దాపూర్, కుప్పగండ్ల, చెదురుపల్లి, బైరాపూర్ గ్రామాల్లో నిర్వాహకులు ప్రత్యేక పూజలు, కుంకుమార్చన నిర్వహించారు. బిజినేపల్లి మండలం, కోడేరు మండలంలోని జనుంపల్లి, నర్సాయపల్లి, సింగాయిపల్లి గ్రామాల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో భక్తులు దర్గా మాతను ఏర్పాటు చేశారు. అమ్రాబాద్, పదర ఉమ్మడి మండలాల్లో ఉత్సవాలు ప్రారంభం కాగా.. అమరేశ్వరాలయం, దండోరా కాలనీతోపాటు పలు గ్రామాల్లో అమ్మవారు బాలా త్రిపురాసందరి దేవిగా కటాక్షించారు. బల్మూరు, తిమ్మాజిపేట మండలాల్లో ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమాల్లో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, సభ్యులు వజ్రలింగం, రాజయ్య, రమేశ్, కుమార స్వామి, సంతోష్, సైదులు, కిరణ్, కుమ్మరి మల్లేశ్, అర్చకులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌లో అమ్మవారికి హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు


బిజినేపల్లి : పాలెంలో దుర్గామాతకు పూజలు చేస్తున్న భక్తులు


బల్మూరు : తుమ్మెన్‌పేటలో అమ్మవారికి పూజలు చేస్తున్న గ్రామస్తులు

కల్వకుర్తిరూరల్ : అమ్మవారికి పూజలు చేస్తున్న పెద్దమ్మ తల్లి యూత్ సభ్యులు

గిరిజనుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

అమ్రాబాద్, అక్టోబర్ 3 : గిరిజనుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్ సంక్షేమ భవన్‌లో గిరిజనుల ఆరోగ్యంపై ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారులు, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణతో సమీక్ష నిర్వహించారు. నల్లమల ప్రాంతంలో గిరిజనులకు వైద్య సదుపాయం కోసం అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

డిజిటల్ కార్డు సర్వే ప్రారంభం

మాట్లాడుతున్న ఆర్డీవో నాగరాజు

పెద్దకొత్తపల్లి, అక్టోబర్ 3 : మండలంలోని దేదినేనిపల్లిలో గురువారం డిజిటల్ కార్డు సర్వేను ఆర్డీవో నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 7వ తేదీ వరకు గ్రామంలో డిజిటల్ కార్డు సర్వే చేపడతారని, ప్రతి కుటుంబంలో ఉండే అందరి సమాచారాన్ని ఈ డిజిటల్ కార్డులో పొందుపరుస్తారని తెలిపారు. దీంతో సంక్షేమ పథకాలుఅందేలా ఫ్యామిలీ డిజిటల్ కార్డులు సిద్ధం చేస్తున్నామని, వీతో లబ్ధిదారులు రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్, ఆరోగ్య సేవలు పొందేలా ఈ కార్డు ప్రతి కుటుంబ సభ్యుని హెల్త్ ప్రొఫైల్ ఆరోగ్య సమాచారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ మోహన్, ఎంపీడీవో నాగేంద్రం, గ్రామ కార్యదర్శి దేవ పాల్గొన్నారు.

మంత్రి వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

వెల్దండ, అక్టోబర్ 3 : మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడు యాదగిరి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ కక్షతో తన ఇమేజ్‌ను మరింత పెంచుకునేందుకే కేటీఆర్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. మంత్రి హోదాల్లో ఉండి అసత్య ఆరోపణలు చేస్తు దిగజారిన రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. కేటీఆర్‌కు క్షమాపణ చెప్పాలని కోరారు.

దరఖాస్తు చేసుకోవాలి

అమ్రాబాద్, అక్టోబర్ 3 : జిల్లాలో దివ్యాంగులు నూతన, రెన్యూవల్ సదరం ధ్రువపత్రాల కోసం శుక్రవారం మీ సేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నర్సింహులు గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన దివ్యాంగులు మీ సేవలో దరఖాస్తు చేసుకున్న రశీదుతోపాటు ఆధార్ జిరాక్స్, ఇది వరకు ఎక్కడైనా దవాఖానలో చూయించుకున్నట్లయితే అందుకు సంబంధించిన రిపోర్టులు, ఎక్స్‌రే, స్కానింగ్, ఎంఆర్ఐ కాపీలతో సదరం క్యాంప్‌నకు హాజరుకావాలన్నారు. రెన్యూవల్ కోసం వచ్చేవారు తప్పకుండా పాత సర్టిఫికెట్, జిరాక్స్ తోపాటు పైన తెలిపిన రిపోర్టులన్నీ తీసుకురావాలని సూచించారు.

ఘనంగా కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం

కల్వకుర్తి రూరల్, అక్టోబర్ 3 : కల్వకుర్తి పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో గురువారం కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని కేవీపీఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు.

సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

- కలెక్టర్ సంతోష్

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 3 : డిజిటల్ ఫ్యామిలీ కార్డు సర్వేకు ప్రజలు సహకరించాలని, సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను కలెక్టర్ సంతోష్ కోరారు. గురువారం నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు ఉయ్యలవాడలో గుడ్లనర్వ జ్యోతి ఇంటి వద్ద కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ నరేశ్‌బాబు, వారి సిబ్బంది నుంచి కలెక్టర్ వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గురువారం ఉదయం నుంచి పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఎలాంటి లోపాలు లేకుండా డిజిటల్ ఫ్యామిలీ కార్డు సర్వే క్షేత్ర స్థాయిలో పరిశీలన పూర్తి చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఉదయం 10 గంటల నుంచి సర్వే ప్రక్రియ మొదలు కావాలని, ముందుగా గ్రామాల్లో ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే నిర్వహిస్తున్నట్లు ప్రచారం చేయాలని సూచించారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే నిర్వహణ పరిశీలన కోసం నాగర్‌కర్నూల్ జిల్లా ప్రత్యేక ఐఏఎస్ అధికారిగా రవిని ప్రభుత్వం నియమించిందన్నారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డుల్లో ఏయే అంశాలను పొందుపర్చాలనే వివరాలను నివేదిక రూపంలో అందజేస్తామన్నారు. ఈనెల 7వ తేదీ వరకు ఐదు రోజులపాటు నిర్వహించే ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేలో కుటుంబ సభ్యుల వివరాల నమోదు మార్పులు చేర్పుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ డిజిటల్ ఫ్యామిలీ కార్డు సర్వేను విజయవంతంగా నిర్వహణకు అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు.

సర్టిఫికెట్ల పరిశీలన పారదర్శకంగా చేపట్టాలి

తెలంగాణ డీఎస్సీ–2024 ఫలితాల్లో నాగర్‌కర్నూల్ జిల్లాలో డీఎస్సీ క్వాలిఫై అయ్యి 1:3 నిష్పత్తి ప్రకారం ఎంపికైన అభ్యర్థులందరికీ ఫోన్‌కాల్స్ ద్వారా తప్పనిసరిగా సమాచారం ఇచ్చి ఒరిజినల్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, సజావుగా చేపట్టాలని కలెక్టర్ సంతోష్ జిల్లా విద్యాధికారులను ఆదేశించారు. డీఎస్సీ నియామక ప్రక్రియలో భాగంగా రాత పరీక్షలో ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమాన్ని గురువారం జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో కలెక్టర్ పరిశీలించారు. అభ్యర్థులందరూ సర్టిఫికెట్ల పరిశీలనలో హాజరు కావాలని సూచించాలని ఆదేశించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 285 పోస్టులకు గానూ 885 మంది అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలిస్తున్నామని కలెక్టర్‌కు సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాధికారి గోవిందరాజులు, ప్రభుత్వ పరీక్షల నిర్వహణాధికారి రాజశేఖర్‌రావు, కార్యాలయ పర్యవేక్షకుడు నాగేందర్, నోడల్ శాఖ అధికారి కుర్మయ్య, సెక్టోరల్ అధికారులు షర్ఫొద్దీన్, నూరుద్దీన్, మురళీధర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి, తిరుపతయ్య, వెంకటేశ్వర్‌శెట్టి పాల్గొన్నారు.

డిజిటల్ సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

సర్వేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి

వెల్దండ, అక్టోబర్ 3 : ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గురువారం వెల్దండ మండలం కంటోనిపల్లిలో ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలెట్ ప్రాజెక్టు సర్వేకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై గ్రామంలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటుకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ డిజిటిల్ కార్డు ప్రతి కుటుంబానికి సంక్షేమం తోపాటు అభివృద్ధి ఫలాలు పొందేందుకు ఉపయోగపడుతుందన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద కంటోనిపల్లి గ్రామాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెద్ది రామకృష్ణ, విండో డైరెక్టర్ వెంకటయ్య, నాయకులు మోతిలాల్, సంజీవ్‌కుమార్, పర్వత్‌రెడ్డి, శ్రీను యాదవ్, సురేందర్, తిరుపతిగౌడ్, జంగయ్యగౌడ్, రషీద్, పుల్లయ్య, ఆర్డీవో శ్రీనివాస్, తాసీల్దార్ కార్తీక్‌కుమార్, ఎంపీడీవో సత్యపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పట్టాదారులకు రుణాలు ఇవ్వాలి

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 3 : జిల్లాలో పోడు భూములు సాగు చేసే పట్టాదారులైన రైతులకు బ్యాంకులు రుణాలు ఇవ్వాలని కోరుతూ గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మా నాయక్, నాయకులు దేశ్యానాయక్, జిల్లా అధ్యక్షుడు అశోక్ నాయక్ కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1950 మంది గిరిజన రైతులకు పోడు భూముల పట్టాలు ఇవ్వడం జరిగిందని, వారు అనేక సంవత్సరాల నుంచి భూములు సాగు చేస్తున్నప్పటికీ రుణాలు ఇవ్వడం లేదని, ఈ విషయంలో కలెక్టర్ చొరవ తీసుకోవాలని కోరారు. 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం గిరిజన రైతులకు పట్టాలు ఇచ్చారని, పోడు భూముల పట్టాలపై గిరిజన రైతులకు బ్యాంకు రుణాలు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సబ్సిడీపై ఇవ్వాలని కోరారు.

కొన్ని ప్రాంతాల్లో ఇవన్నీ అమలవుతున్నా నాగర్‌కర్నూల్ జిల్లాలో మాత్రం అమలు రాకపోవడంతో గిరిజన రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమ భూములకు రుణాలు ఇవ్వాలని ఆయన కోరారు.

డీఎస్పీ విచారణ

తిమ్మాజిపేట, అక్టోబర్ 3 : ఎస్సీ, ఎస్టీ కేసుపై గురువారం తిమ్మాజిపేటలో నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్ విచారణ నిర్వహించారు. ఎస్సై నరేందర్ డెడ్డి తెలిపిన వివరాల మేరకు చేగుంట గ్రామానికి చెందిన అమ్మాయి (21)ని తిమ్మాజిపేటకు చెందిన అబ్బాయి ప్రేమ పేరుతో వెంటపడి తర్వాత పెళ్లి చేసుకునేందుకు నిరాకరించాడు. దీంతో అమ్మాయి తిమ్మాజిపేట పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. దీనిపై డీఎస్పీ విచారణ అనంతరం యువకుడిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబురాలు

కల్వకుర్తి రూరల్ : బతుకమ్మతో విద్యార్థులు అధ్యాపకులు

కల్వకుర్తి/కల్వకుర్తిరూరల్, అక్టోబర్ 3 : కల్వకుర్తి పట్టణంలోని వైఆర్ఎం కళాశాలలో గురువారం పాఠశాల విద్యార్థులు బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు తీరొక్క పూలతో బతుకమ్మ పేర్చి పూజలు చేశారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులాళ్లు బతుకమ్మలను ఆడారు. అదేవిధంగా కల్వకుర్తి పట్టణంలోని మిలినియనం పాఠశాలలో గురువారం బతుకమ్మ సంబురాలను ఘనంగా జరుపుకొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్నారు. బొడ్డెమ్మలను పేర్చి బతుకమ్మ పాటలు పాడుతూ ఆడారు. బతుకమ్మ పండుగ గొప్పతనం, సంస్కృతి, సంప్రదాయాల గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సాంబయ్యగౌడ్, వైస్ ప్రిన్సిపాల్ శంకరయ్య, అధ్యాపకులు, విద్యార్థినులు ఉన్నారు.

దసరా సెలవుల్లో ఇండ్లు జాగ్రత్త

తిమ్మాజిపేట, అక్టోబర్ 3 : దసరా పండుగ సందర్భంగా వచ్చిన సెలవుల్లో ఊర్లకు వెళ్లే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాసులు సూచించారు. గురువారం తిమ్మాజిపేట పీఎస్‌లో ఎస్సీ, ఎస్టీ కేసు విచారణకు వచ్చిన ఆయన పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. సెలవుల్లో ఇండ్లలో బంగారం, డబ్బులు, ఇతర వస్తువులను జాగ్రత్తగా ఉంచుకోవాలని, లేదా తమ వెంట తీసుకెళ్లాడం, బ్యాంక్ లాకర్లలో పెట్టుకోవాలని సూచించారు. ఇంటికి సంబంధించి అన్ని రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో గంజాయి, డ్రగ్స్ చలామణి ఉంటే సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. సమావేశంలో ఎస్సై నరేందర్ డెడ్డి పాల్గొన్నారు.

డిజిటల్ సర్వే పరిశీలన

బిజినేపల్లి, అక్టోబర్ 3: మండలంలోని బోయపూర్‌లో నిర్వహిస్తున్న డిజిటల్ సర్వేను గురువారం ఆర్డీవో సురేశ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైలెట్ ప్రాజెక్టు కింద సర్వేను గ్రామాల్లో నిర్వహించి క్షేత్ర స్థాయిలో కుటుంబ సభ్యుల పూర్తి వివరాలను సేకరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఖతాలప్ప, తాసీల్దార్ శ్రీరాములు, సుశ్మిత ఉన్నారు.

ఐక్యంగా ఉండాలి

అచ్చంపేట రూరల్, అక్టోబర్ 3 : జర్నలిస్టులంతా ఐక్యంగా ఉన్నప్పుడే హక్కులను సాధించగలమని ఐజేయూ రాష్ట్ర కార్యదర్శి మధుగౌడ్ అన్నారు. గురువారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ ట్రేడర్స్ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించేందుకు టీయూడబ్ల్యూజే(ఐజేయూ) కృషి చేస్తున్నదన్నారు. ఈనెల 6న అచ్చంపేట నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం నిర్వహిస్తున్నామని, రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్‌అలీ హాజరవుతున్నట్లు తెలిపారు. సమావేశంలో జాతీయ కౌన్సిల్ సభ్యుడు కర్ణయ్య, జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాములునాయక్, నాయకులు సాయిబాబు పాల్గొన్నారు.

మురుగుకాల్వను శుభ్రం చేయించిన అధికారులు

నమస్తే ఎఫెక్ట్

మురుగుకాల్వలో చెత్తను తొలగిస్తున్న జేసీబీ

కోడేరు, అక్టోబర్ 3 : మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డుపై మురుగు పారు తున్న విషయంపై గత నెల 26వ తేదీన 'రోడ్డుపై పారు తున్న మురుగు నీరు' పట్టించుకోని అధికారులు అనే శీర్షికను నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మురుగు నీరు కాలువగుండా వెళ్లకుండా చెత్తా చెదారం పేరుకో పోవడంతో మురుగు నీళ్లన్నీ రోడ్డుపై ఎక్కి పారుతున్నాయి. ఈ విషయాన్ని పత్రికలో ప్రచురణ కావడంతో ఎంపీడీవో శ్రావణ్‌కుమార్ పంచాయతీ కార్యదర్శి రవితేజలు గురువారం జేసీబీని ఏర్పాటు చేయించి కాల్వను శుభ్రం చేయించి రోడ్డుపైకి మురుగు రాకుండా చర్యలు చేపట్టారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఇసుక అక్రమ రవాణా కట్టడిలో పోలీసుల విఫలం

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 3: మల్టీ జోన్–2 పరిధిలోని నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయడంలో విఫలమైన ఓ ఎస్సైని బదిలీ చేయగా, మరో నలుగురు ఎస్సైలను వీఆర్‌లో ఉంచినట్లు మల్టీ జోన్ ఐజీపీ సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయంలో ఇప్పటికే జిల్లాలోని అచ్చంపేట ఎస్సైని బదిలీ చేయగా బిజినేపల్లి, తెలకపల్లి, వంగూరు, ఉప్పునుంతల మండలాల ఎస్సైలను వీఆర్‌లో ఉంచారు. వీరిలో కొందరికి ఇసుక అక్రమ రవాణలో ప్రత్యక్ష, పరోక్ష సహకారం ఉండడంతో వారిపై డిపార్ట్‌మెంటల్ చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర నిఘా అధికారుల నివేదికలు, ఇతర ఎంక్వాయిరీల ద్వారా చర్యలు తీసుకున్నట్లు ఐజీపీ తెలిపారు. ప్రధానంగా ఇసుక అక్రమ రవాణా ద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండిపడు తుందని, వాగుల్లో, నిషేధిత నదీ ప్రాంతాల్లో విచక్షణా రహితంగా ఇసుకను తవ్వితే పర్యావరణ సమతుల్యానికి భంగం వాటిల్లే అవకాశం ఉండడంతో ప్రభుత్వం ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

పట్టుకున్నారు.. వదిలేశారు..

- అనుమతులు లేకుండా ఎర్రమట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లను వదలడంపై అనుమానాలు

అధికారులు పట్టుకున్న మట్టి ట్రాక్టర్లు

కోడేరు, అక్టోబర్ 3 : మండల కేంద్రంలోని ఊరగుట్ట (బలుపాలగుట్ట)పై అనుమతి లేకుండా ఎర్రమట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లను రెవెన్యూ పోలీసు అధికారులు పట్టుకొని వదిలేయడంపై స్థానికులు పలు రకాలుగా అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. తాసీల్దార్ విజయ్‌కుమార్ గురువారం ఉదయం 10:30 గంటల సమయంలో రెవెన్యూ కార్యాలయానికి విధులకు వస్తున్నారు. ఈక్రమంలో స్థానిక ఉమామహేశ్వర స్వామి ఆలయం వద్ద రోడ్డుపై ఎర్రమట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లను నిలిపి మట్టిని ఎక్కడి నుంచి ఎక్కడికి తరలిస్తున్నారని, అందుకు గానూ మైనింగ్ అనుమతులు ఉన్నాయా అని అడిగారు. అందుకు వారు ఎలాంటి అనుమతులు లేవని సమాదానం ఇచ్చారు. దీంతో వెంటనే వాటిని నిలిపివేసి చర్యలు తీసుకోవాలని ఎస్సై గోకారిని ఆదేశించారు. తాసీల్దార్ ఆదేశాల మేరకు ఎస్సై గోకారి ఇద్దరు పోలీసు సిబ్బందిని ట్రాక్టర్లను పట్టు కొని పోలీసు స్టేషన్‌కు తీసుకురావాలని ఆదేశించారు. దీంతో పాటు తాసీల్దార్ రెవెన్యూ సిబ్బంది కూడా ఆదేవిం చడంతో ఇటు పోలీసులు అటు రెవెన్యూ సిబ్బంది మట్టి ట్రాక్టర్లను రోడ్డుపై ఆపేశారు. పట్టుబడిన మట్టి ట్రాక్టర్లను గంట వ్యవధిలోనే వదిలేయడంతో పోలీసు, రెవెన